

గణేశ పంచరత్న స్తోత్రమ్ - భావార్థముతో

శ్రీ శంకరాచార్య విరచితం



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

గణేశ పంచరత్న స్తోత్రమ్ - భావార్థముతో -

01. ముదా కరాత్త మోదకం సదా విముక్తి సాధకమ్।
కళాధరావతంసకం విలాసిలోక రక్షకమ్।
అనాయకైక నాయకం వినాశితేభ దైత్యకమ్।
నతాశుభాశు నాశకం నమామి తం వినాయకమ్॥

సంతోషముతో ఉండ్రాళ్లు పట్టుకున్నవాడు, ఎల్లప్పుడూ మోక్షమిచ్చువాడు, అనాథలకు దిక్కైనవాడు, చంద్రుని తలపై అలంకరించుకున్నవాడు, విలసిల్లులోకములను రక్షించువాడు, గజాసురుని సంహరించినవాడు, భక్తుల పాపములను వెంటనే పోగొట్టువాడు అగు వినాయకుని నమస్కరించుచున్నాను.

సంతోషముతో ఉండ్రాళ్ళు చేతిలో పట్టుకుని, తన భక్తులకు ఎల్లప్పుడూ మోక్షం ఇచ్చేవాడు, చంద్రుడిని ఆభరణంగా శిరస్సు మీద ధరించినవాడు మరియు ఆనందంగా లోకాలన్నీ రక్షించేవాడు, నాయకులు (అనాథ/దిక్కులేని వారికి) లేని వాళ్ళకు నాయకుడైనట్టివాడు, మరియు గజాసురుడు అనే రాక్షసుని నాశనం చేసినవాడు, తన భక్తులకు అడ్డంకులు మరియు దుర్మార్గపు విషయాలు / ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని త్వరగా నాశనం చేసే అలాంటి వినాయకునికి నేను నమస్కరిస్తున్నాను.

02. నతేతరాతి భీకరం నవోదితార్క భాస్వరమ్।
నమత్సురారి నిర్జరం నతాధికాపదుద్ధరమ్।
సురేశ్వరం నిధీశ్వరం గజేశ్వరం గణేశ్వరమ్।
మహేశ్వరం తమాశ్రయే పరాత్పరం నిరంతరమ్॥

నమస్కరించని వారికి అతి భయంకరుడు, ఉదయించిన సూర్యుడువలే ప్రకాశించువాడు, రాక్షసులను, దేవతలను తన అధీనములో నుంచుకొన్నవాడు,

నమస్కరించు వారిని ఆపదల నుండి ఉద్ధరించువాడు, దేవతలకు రాజు, నిధులకధిపతి, గజేశ్వరుడు, ప్రమథ గణములకు నాయకుడు, ఐశ్వర్య సంపన్నుడు, పరాత్పరుడు అగు వినాయకుని ఎల్లప్పుడూ ఆశ్రయిచుకున్నాను.

భక్తుల శత్రువులకు భీకర స్వరూపుడైనవాడు, అప్పుడే ఉదయించిన కొత్త (బాల) సూర్యుడిలా ప్రకాశించేవాడు, దేవతలు, అసురులచే నమస్కరింపబడేవాడు, తన భక్తులను అడ్డంకుల నుండి విడిపించి కాపాడేవాడు, దేవతలకు దేవుడివి, సమస్త నిధులకు అధిపతివి, గజరాజువి, దేవతల ప్రమధగణములకు అధిపతివి, చాలాగొప్ప దేవుడివి, తనను ఆశ్రయించిన వారికి (అన్ని తత్వములకన్న అధికమైనట్టి మాయ కన్నా అధికుడైన) నిరంతరం కల్పించేవాడు.

03. సమస్త లోక శంకరం నిరస్త దైత్య కుంజరమ్।
దరేతరోదరం వరం వరేభ వక్త్రమక్షరమ్।
కృపాకరం క్షమాకరం ముదాకరం యశస్కరమ్।
మనస్కరం నమస్కృతాం నమస్కరోమి భాస్వరమ్॥

సమస్తలోకములకు మేలు చేయువాడు, మదించిన ఏనుగులవంటి రాక్షసులను సంహరించిన వాడు, పెద్ద బొజ్జ కలవాడు, శ్రేష్ఠుడు, గజముఖుడు, నాశములేనివాడు, దయదలచువాడు, సహనవంతుడు, సంతోషమునకు స్థానమైన వాడు, కీర్తికలిగించువాడు, నమస్కరించు వారికి మంచి మనస్సు నిచ్చువాడు, ప్రకాశించు వాడు అగు వినాయకుని నమస్కరించు చున్నాను.

అన్ని లోకములకు శుభములను కలిగించేవాడు, గజాసుర అనే రాక్షసుడిని నాశనం చేసినవాడు, పెద్ద బొజ్జ కలిగినవాడు, వరాలు ఇచ్చేవాడు, మహోత్తముడు, గజ (ఏనుగు) ముఖం కలిగినవాడు, నాశనం లేనివాడు, దయ చూపేవాడు, తప్పులను క్షమించేవాడు, సంతోషము మరియు కీర్తి ఇచ్చేవాడు, నమస్కరించు వారలకు మంచి మనస్సు ఇచ్చేవాడు, గొప్ప కాంతి కలవాడునగు శ్రీ వినాయకునకు నమస్కారము.

04. అకించనార్తి మార్జనం చిరంతనోక్తి భాజనమ్।
పురారి పూర్వ నందనం సురారి గర్వ చర్వణమ్।
ప్రపంచ నాశ భీషణం ధనంజయాది భూషణమ్।
కపోల దానవారణం భజే పురాణ వారణమ్॥

దరిద్రుల బాధలను తొలగించువాడు, వేదవాక్కులకు నిలయమైనవాడు, శివుని పెద్ద కుమారుడు, రాక్షసుల గర్వమును అణగ దొక్కువాడు, ప్రళయకాల భయంకరుడు , అగ్ని మొదలగు దేవతలకు అలంకారమైనవాడు, చెంపలపై మద జలము కారుచున్నవాడు అగు గజాననుని సేవించు చున్నాను.

నిరాశ్రయుల బాధలను తొలగించేవాడు, పురాతన గ్రంథాలు మరియు తొలి చదువులకు నిలయమైనవాడు, శివుని యొక్క మొదటి కుమారుడు, రాక్షసుల అహంకారాన్ని నాశనం చేసేవాడు, ప్రపంచ నాశనం చేసే సమయంలో భయంకర మైన రూపం కలిగినవాడు, అగ్ని మొదలైన దేవతలు తనను ఆభరణంగ ధరించ బడినవాడు, చెంపల పై మదజలము కారుచున్నవాడు, అనాదిగా పూజింప బడుతున్న గజ (ఏనుగు) ముఖం కలిగిన దేవుడిని ఆరాధిస్తాను.

05. నితాంత కాంత దంత కాంతి మంత కాంత కాత్మజమ్।
అచింత్య రూపమంత హీన మంతరాయ కృంతనమ్।
హృదంతరే నిరంతరం వసంతమేవ యోగినామ్।
తమేకదంతమేవ తం విచింతయామి సంతతమ్॥

తళతళలాడు దంతమున్న వాడు, యముని కూడ అంతమొందించు శివునకు పుత్రుడు, ఊహకందని రూపము కలవాడు, అంతము లేనివాడు, విఘ్నములను భేదించువాడు అగు ఏకదంతుని ఎల్లప్పుడు ధ్యానించు చున్నాను.

మనోహరమైన దంతపు కాంతి కలిగినవాడు, యముడికి యముడగు శివుని కుమారుడు, ఆలోచింప శక్యముకాని రూపం కలిగినవాడు, అంతము లేనివాడు, అడ్డంకులను తొలగించువాడు, యోగుల యొక్క హృదయాలలో శాశ్వతంగా నివసించేవాడు అయిన ఆ ఏక దంతుని నేను నిరంతరం ధ్యానిస్తాను.

06. మహాగణేశ పంచరత్నమాదరేణ యోఽన్వహమ్।
ప్రజల్పతి ప్రభాతకే హృది స్మరన్ గణేశ్వరమ్।
అరోగతామదోషతాం సుసాహితీం సుపుత్రతామ్।
సమాహితాయు రష్టభూతి మభ్యుపైతి సోఽచిరాత్॥

ప్రతిదినమూ ప్రాతఃకాలమునందు గణేశ్వరుని హృదయములో స్మరించుచూ ఎవడు భక్తితో ఈ గణేశ పంచరత్న స్తోత్రమును పఠించునో అతడు ఆరోగ్యమును, నిర్దోషత్వమును, మంచి విద్యను, చక్కని సంతానమును పొంది చిరాయువై శీఘ్రముగనే అష్టైశ్వర్యములను పొందును.

ప్రతి దినము ప్రాతః కాలమున భక్తితో గణేశుడిని తన హృదయంలో తలచుకుని ఈ “మహాగణేశ పంచరత్న” మును భక్తితో పఠించేవారికి… ఆరోగ్యకరమైన జీవితాన్ని, దోషాలు లేని జీవనమును, మంచి విద్యను, చక్కని సంతానమును, దీర్ఘాయువును, అష్టైశ్వర్యములను, వేగంగా పొందుతారు.

// ఇతి శ్రీశఙ్కరభగవతః కృతౌ శ్రీ గణేశ పంఞ్చరత్న స్తోత్రమ్ సమ్పూర్ణమ్ //

– – – = – – –

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)